
సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 16 । జూన్ । 2023



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మల్లారెడ్డి మధులతారెడ్డి (హైదరాబాద్) రూ.లక్ష విరాళాన్ని గురువారం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 1,875, మధ్య డెల్టాకు 1,345, పశ్చిమ డెల్టాకు 3,535 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం 44.0° / 29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	29.5
కాకినాడ	41.0	29.8
అమలాపురం	43.0	29.0

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు అభ్యర్థులకు ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి కలవారు ఆరోజు ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 83090 10013 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందిస్తున్న సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోసం నిర్వహిస్తున్న సంస్థలు అనగా ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలు, ప్రత్యేక విద్యా సంస్థలు, ప్రత్యేక వృత్తిపరమైన శిక్షణ ఇచ్చే సంస్థలు తప్పనిసరిగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కాకినాడలోని ప్రభుత్వ బధిర బాలుర వసతి గృహంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువులు, వరి విత్తనాలు సిద్ధం



మాధవరావు, వ్యవసాయాధికారి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో జిల్లాలో 1,94,609 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు లక్ష్యమన్నారు. వరినారుమళ్ల లక్ష్యం 9,210 ఎకరాలకు గాను గురువారానికి 2,952 ఎకరాల్లో పనులు జరిగాయన్నారు. ఇప్పటివరకూ నారు పోసిన విస్తీర్ణం సుమారుగా 30,000 ఎకరాల్లో నాట్లు వేయడానికి సరిపోతుందన్నారు. ఈనెల 20 నుంచి నాట్ల ప్రక్రియ త్వరితగతిన జరుగుతుందన్నారు. ఈనెల ఒకటి నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేస్తున్నారన్నారు. జిల్లాలో సెమిడెల్టా సిస్టమ్ అంటే 60 శాతం బోర్ల సౌకర్యం ఉండడం వల్ల నీటి సమస్య ఉండదన్నారు. 54 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవ్వగా, రైతు నుంచి రైతుకు 48 వేల క్వింటాళ్లు అవసరానికి అనుగుణంగా రైతుభరోసా కేంద్రాల్లో 400 క్వింటాళ్లు, ప్రైవేటు డీలర్ల దగ్గర 5600 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పీఎం కిసాన్ – ఈకేవైసీ చేయించుకోని రైతులు ఇంకా 25,540 మంది ఉన్నారన్నారు. వారందరూ రెండు రోజుల్లో చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, వీటిలో యూరియా 6,962, డీఏపీ 3,539, ఎంఓపీ 1,934, కాంప్లెక్స్ 5,469, ఎస్ఎస్‌పీ 3,889.. మొత్తం 21,792 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పెళ్లి భోజనాలు, టిఫిన్ల రుసుము పెంపు

అన్నవరం: రత్నగిరిపై వివాహాలు చేసుకునే వివాహ బృందాలు తాము సొంతంగా వండించిన ఆహార పదార్థాలను కొండదిగువ నుంచి రత్నగిరికి తీసుకువెళ్లేందుకు గాను చెల్లించాల్సిన రుసుములను అధికారులు పెంచారు. భోజనాల రుసుమును రూ.5 వేలు, టిఫిన్లను రూ.3 వేలకు పెంచారు. గతంలో భోజనాలకు రూ.3 వేలు, టిఫిన్లకు రూ.1,500 మాత్రమే వసూలు చేసేవారు. ఈ మొత్తం టోల్‌గేట్ వద్ద దేవస్థానానికి చెల్లించి ఆహార పదార్థాలను దేవస్థానానికి తీసుకువెళ్లవచ్చు. కళాశాల మైదానంలో వంటలు చేసుకుంటే రూ.100 చెల్లించాలి. దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో టూరిస్టు బస్సులు, ఇతర పెద్ద వాహనాల్లో వచ్చే భక్తులు వంటలు చేసుకుంటే శానిటరీ చార్జెస్ కింద రూ.100, చిన్న వాహనాలు రూ.50 చెల్లించాలి. కళాశాల మైదానంలో కార్లు నిలిపితే పార్కింగ్ ఫీజు కింద రూ.20 చెల్లించాలని అధికారులు తెలిపారు.

జాతీయ ఎన్‌సీసీ శిబిరానికి శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని: జాతీయ స్థాయి ఎన్‌సీసీ శిబిరానికి స్థానిక శ్రీప్రకాష్ పాఠశాలకు చెందిన ఇద్దరు క్యాడెట్లు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం బి.సీతారాణి గురువారం తెలిపారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న ఎన్‌వీఎస్ఎం.ముకేష్, బి.మధు వీరేంద్ర గుంటూరులో జరిగే ఆలిండియా ఏక్ భారత్–స్వచ్ఛ భారత్ –2 శిబిరానికి అర్హత సాధించారన్నారు. వీరు గురువారం నుంచి జూలై 26 వరకూ గుంటూరులో జరిగే అంతరాష్ట్ర శిక్షణ శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి అభినందించారు.

పేదలకు అనుగృహం..

- జిల్లాలో వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం
- వచ్చే నెలాఖరుకు 19,396 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం
- ఇప్పటికే 16,725 పూర్తి
- నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికలు
- ఊళ్లను తలపిస్తున్న గృహ సముదాయాలు



రాజానగరం మండలం వెలుగుబంద లేఅవుట్లో వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

సాక్షి, రాజమహేంద్రవరం: 'పేదవాడికి అను'గృహం' దక్కుతోంది. సొంతింటి కల సాకారం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. అద్దె భవనాల్లో అవస్థల జీవనం సాగించే రోజులు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. జూలై మాసాంతానికి శాశ్వత గృహ యజమానులుగా మార్చేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. సొంతిల్లు అందించి కుటుంబాల్లో సంతోషాన్ని సంపూర్ణంగా నింపేందుకు కసరత్తు ప్రారంభించింది. అందుకు గాను నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. గృహాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కాలనీల్లో చిన్న చిన్న పనులను పూర్తి చేస్తున్నారు. మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి గృహ నిర్మాణ పనులకు పర్యవేక్షిస్తున్నారు. ఇల్లు కట్టుకోలేని వారికి అవగాహన కల్పించి నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తుండటంతో లబ్ధిదారుల సైతం ముందుకువస్తున్నారు.

లక్ష్యాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 68,074 గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. 58,916 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 1,823 గృహాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఇందుకు గాను రూ.1225.20 కోట్లు వెచ్చిస్తున్నారు. జూలై మాసాంతానికి జిల్లా వ్యాప్తంగా 19,396 నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అధికార యంత్రాంగం సంకల్పించింది. అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే 16,725 ఇంటి పనులు వంద శాతం పూర్తయ్యాయి. 86 శాతం లక్ష్యం అధిగమించారు. మిగిలిన 2,671 నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫలితంగా అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు శ్రమిస్తున్నారు. ప్రతి మండలంలో హౌసింగ్ అధికారులు, తహశీల్దార్లు ప్రత్యేక బృందంగా ఏర్పడి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ఒకే చోట 13,069 కుటుంబాలకు ఆవాసం:

వేలాది ఇళ్ల నిర్మాణం సాగుతోంది. కాపవరం, బూరుగుపూడి లేఅవుట్ల అనంతరం అత్యధికంగా వెలుగుబంద లేఅవుట్లలో 13,069 కుటుంబాలకు అవాసం కల్పించనున్నారు. ఫలితంగా ప్రతి జగనన్న కాలనీ ఓ పంచాయతీ, ఓ మున్సిపాలిటీలను తలపిస్తున్నాయి. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ వెలుగుబంద లేఅవుట్. రాజమహేంద్రవరానికి దగ్గరలో ఉండటంతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. జిల్లాలో అతిపెద్ద లేఅవుట్లలో మూడో లే అవుట్‌గా స్థానం పొందిన వెలుగుబందలో గృహ నిర్మాణం నిరాటంకంగా సాగుతోంది. ఇక్కడ నీటి, విద్యుత్ సౌకర్యం సమకూర్చడం లబ్ధిదారుల్లో ఆనందాన్ని నింపుతోంది. రహదారి మార్గం ఏర్పడింది. ఇప్పటికే కొందరు గృహ ప్రవేశం చేశారు. మరికొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని చివరి దశలో ఉన్నాయి.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. లేఅవుట్‌లలో గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. తాగునీటి వసతి నిమిత్తం బోర్లు తవ్వుతున్నారు. తాగు, మిగిలిన అవసరాలకు నీటిని సమకూరుస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయినా కాలనీల్లో నివసించేందుకు వీలుగా ఏర్పాట్లు ఉంటున్నాయి. ఫలితంగా అనపర్తి, బిక్కవోలు, తొర్రేడు, చాగల్లు, కొవ్వూరు కృష్ణారావు చెరువు, కడియం, దామిరెడ్డిపల్లి, నిడదవోలు వైఎస్సార్‌నగర్ తదితర ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులు వాయు వేగంతో సాగుతున్నాయి. జగనన్న కాలనీల్లో విద్యుత్ వసతి కల్పించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ



రాష్ట్రంలో జూలై నెలాఖరుకు 5 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు కల్పించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నాం. నిర్మాణ పనులు త్వరితగతిన సాగుతున్నాయి. 19,396 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా.. ఇప్పటికే 16,725 పూర్తయ్యాయి. మిగిలినవి వేగవంతంతంగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నాం. లబ్ధిదారులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కె.మాధవీలత, కలెక్టర్

జిల్లాలో ఇళ్ల లక్ష్యం.. పురోగతి ఇలా..

మండలం	లక్ష్యం	పూర్తయినవి	శాతం
అనపర్తి	721	611	85
బిక్కవోలు	850	782	92
చాగల్లు	1549	1371	89
దేవరపల్లి	158	33	21
గోకవరం	212	170	80
గోపాలపురం	69	1	1
కడియం	873	705	81
కోరుకొండ	942	799	85
కొవ్వూరు	1503	1359	90
కొవ్వూరు అర్బన్	694	544	78
నల్లజెర్ల	21	13	62
నిడదవోలు	1430	1283	90
నిడదవోలు అర్బన్	669	580	87
పెరవలి	1433	1348	94
రాజమండ్రి అర్బన్	1025	710	59
రాజమండ్రి రూరల్	776	626	81
రాజానగరం	2097	1928	92
రంగంపేట	1489	1382	93
సీతానగరం	617	517	84
తాళ్లపూడి	654	456	70
ఉండ్రాజవరం	1614	1507	93

దేశం గర్వపడేలా ప్రధాని మోదీ పాలన

- చంద్రబాబు వ్యాఖ్యలు విడ్డూరం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి అమలు చేసిన పథకాలతో దేశం గర్వంగా తలెత్తుకునేలా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారని అడగడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వద్ద రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై ఆధారాలు ఉంటే కోర్టులో పిల్ వేయాలని, సీబీఐ ద్వారా విచారణ జరిపిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.మూడు లక్షల కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ. 65 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పథకాలకు నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారి మళ్లిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని మంత్రులు అవగాహన లేకుండా రాజకీయ విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చడంతో పాటు జాతీయ రహదారులు, పోర్టులను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

- ఉపాధిలో పనిదినాలు పెంచాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు స్టేజ్ కన్వర్షన్‌పై మరింత దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు ఆదేశించారు. జగనన్న సురక్ష, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, రీసర్వే, భూసేకరణ, హౌసింగ్, స్పందన, ఉపాధి హామీ వేతనాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి గురువారం వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్ ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. దీనిపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కోసం మండల స్థాయిలో జూన్ 17న సమావేశం నిర్వహించి, జూన్ 23 నుంచి క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. జగనన్న భూరక్ష, భూహక్కు పథకం కింద ఫేజ్ – 2 రీసర్వే పనులను ప్రారంభించిన అక్టోబర్ 15 నాటికి పట్టాలు పంపిణీ పూర్తి చేసి, కనీసం ఒక గ్రామంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇంటి నిర్మాణాలకు సంబంధించి కన్వర్షన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణంలో భాగంగా 390 గ్రామ సచివాలయ భవనాలకు గాను 381 ప్రగతిలో ఉండగా 328 పూర్తి చేశామని, మరో 31 చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. 373 ఆర్బీకే భవనాలకు 352 ప్రగతిలో ఉండగా 269 పూర్తి చేశామని, మరో 36 చివరి దశకు చేరుకున్నాయన్నారు. 337 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు 293 ప్రగతిలో ఉండగా 202 పూర్తి చేశామని, మరో 41 చివరి దశలో ఉన్నాయన్నారు. ఉపాధి పథకంలో జిల్లాలో చేపడుతున్న అమృత్ సరోవర్ కింద కేంద్ర బృందం తనిఖీ చేసే క్రమంలో జిల్లాలో 10 బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించామని, శుక్రవారం నాటికి పూర్తి సంసిద్ధంగా ఉంటామని తెలిపారు. ఉపాధి హామీలో నూరుశాతం లక్ష్యలను సాధిస్తామన్నారు. సమావేశంలో జేసీ తేజ్ భరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గరిష్ట స్థాయికి పొగాకు ధర

- రోజురోజుకూ పెరుగుతున్న ధర
- రూ.482 కోట్ల పొగాకు విక్రయాలు



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: మార్కెట్లో పొగాకు ధర రికార్డుస్థాయికి చేరింది. ధర రోజురోజుకూ పెరుగుతోంది. రోజుకు కిలోకు రూ.15 నుంచి 18 పెరుగుతుంది. రైతులు, అధికారులు ఊహించని విధంగా మార్కెట్లో పొగాకు ధరలు పెరగడంతో కొనుగోలుదారులు పోటీపడుస్తున్నారు. మార్కెట్లో ధర అనూహ్యంగా పెరగడంతో రైతులు కౌలు భూములు, బ్యారన్లకు ఎగబడుతున్నారు. ఫలితంగాకౌలు భారీగా పెరిగింది. బ్యారన్ కౌలు కూడా పెరిగినట్టు రైతులు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం నాటికి రూ.482 కోట్ల విలువ గల 24 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో గరిష్ట ధర రూ.254, సగటు ధర రూ.201 లభించింది. బుధవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.236 ఉండగా, గురువారం మార్కెట్లో రూ. 18 లభించింది. సగటు ధర కిలోకు ఒక రూపాయి పెరిగింది. పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో రైతుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో వచ్చే ఏడాదికి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. గత ఏడాది ఎకరం కౌలు రూ.35 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.55 నుంచి 60 వేలు పలుకుతుంది. బ్యారన్ లీజు రూ. 1.80 లక్షలు పలుకుతుంది. కౌలు ధర చూసి చిన్న, సన్నకారు రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

వ్యవసాయ కోణంలో చూడాలి



మార్కెట్లో కొనుగోలు దారుల మధ్య పోటీ పెరిగింది. ఎగుమతి ఆర్డర్లు రావడంతో ఎగుమతి దారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ మార్కెట్‌ను చూసి రైతులు వచ్చే ఏడాదికి అధిక ధరకు భూములు, బ్యారన్లు తీసుకుంటే ఇబ్బంది పడతారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు జాగ్రత్తపడాలి. గత ఏడాది కంటే ఉత్పత్తి ఖర్చులు 15 నుంచి 20 శాతం పెరగ్గా, కిలో పొగాకుకు సగటున రూ.5 నుంచి 6 పెరిగింది. గత ఏడాది కిలో గరిష్ట ధర రూ.245 పలకగా, ఈ ఏడాది ప్రస్తుత మార్కెట్లో రూ.254 పలుకుతుంది. పొగాకు సాగును వ్యాపారంగా కాకుండా వ్యవసాయంగా చూడాలి.

– ఆదిశేషయ్య, పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు, రాజమహేంద్రవరం

రైల్వే ఆర్వోబీలకు పచ్చజెండా

- పట్టాలెక్కనున్న నిర్మాణ పనులు
- సీఎం చొరవతో పిఠాపురం,నిడదవోలు మార్గాల్లో రూ.106.08 కోట్లు మంజూరు
- మూడు దశాబ్దాల కల సాకారం
- ప్రజలకు తొలగనున్న ఇక్కట్లు



నిడదవోలు రైల్వేట్రాక్ వద్ద ట్రాఫిక్ రద్దీ



పిఠాపురం-ఉప్పాడ రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న రెండు ప్రధాన రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు మోక్షం లభించింది. నాడు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్వోబీలకు కదలిక వచ్చింది.

ఈ మార్గమే దిక్కు

ఇటు కాకినాడ, అటు రాజమహేంద్రవరం నగరాలతో పాటు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రయాణికులకు నిడదవోలు కీలకమైన రైల్వే మార్గం. తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాల నుంచి రాకపోకలు సాగించాలంటే ఇక్కడి రైల్వే గేట్ దాటాల్సిందే. ఈ ట్రాక్‌పై రోజూ రెండొందల రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడి ట్రాక్ దాటి ముందుకు వెళ్లాలంటే గంట గంటకూ నరకమే. రోజూ సుమారు 160 పర్యాయాలు గేట్ వేస్తూ తీస్తూ ఉండాలి. నిత్యం సుమారు 15వేల మంది రాకపోకలు జరిపే ఈ మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇక్కడ రూ.200.74 కోట్లతో ఆర్వోబీ నిర్మించాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. కేంద్రం వాటాగా రూ.32 కోట్లు కేటాయించింది. రైల్వేట్రాక్‌పై పనులు పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి భూ సేకరణకు ఇప్పటికే రూ.22 కోట్లు కేటాయించింది.

నాడు గాలికి వదిలేసిన చంద్రబాబు

నిడదవోలు రైల్వే గేటు సమస్య పరిష్కరిస్తామంటూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అనేక పర్యాయాలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. 2019లో ఎన్నికలు వచ్చేస్తున్నాయని చంద్రబాబు హడావుడిగా ఆర్వోబీకి శంకుస్థాపన చేసేశారు. కానీ ఒక్క అడుగు కూడా నిర్మాణానికి ముందుకు పడలేదు. చంద్రబాబు శంకుస్థాపన చేసి గాలికొదిలేశారనే విషయాన్ని టీడీపీ నాయకులు మరుగునపరిచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కారణంగానే పనులు సాగడం లేదని విమర్శలకు దిగుతుండటం విశేషం.


నేడు స్పందించిన జగన్

ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్రకు వచ్చినప్పుడు స్థానికులు ఆర్వోబీ నిర్మించాలంటూ విజ్ఞాపనలు అందచేశారు. ఈ వినతులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించారు. నిడదవోలు, పిఠాపురం ఆర్వోబీలకు రూ.106.08 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మంజూరుచేశారు. ఈ నిధులతో ఆర్వోబీల నిర్మాణానికి భూ సేకరణతో పాటు అప్రోచ్‌రోడ్ల పనులు చేపట్టారు. ఇవి వేగం పుంజుకోనున్నాయి. వచ్చే జూన్ నాటికి నిడదవోలు ఆర్వోబీ పూర్తి చేయనున్నారు. సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి నమూనాలో ఈ ఆర్వోబీ నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నిడదవోలుకు మూడు వైపులా వంతెనలు నిర్మించనున్నారు. వీటిని పూర్తిచేసి దశాబ్దాల కలను సాకారం చేయాలని ప్రభుత్వ గట్టి పట్టుదలతో ఉంది.

పాతికేళ్ల సమస్యకు పరిష్కారం

కాకినాడ జిల్లాలో ప్రధాన పట్టణాలతో కాకినాడ తీర ప్రాంతాన్ని అనుసంధానం చేసే దక్షిణ మధ్య రైల్వేలో పిఠాపురంలోని ఉప్పాడ రైల్వే గేటు ప్రధానమైంది. ఈ లైన్‌లో రోజూ 250 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే గేటు మీదుగా నిత్యం 5 వేలకు పైగా వాహనాలు ప్రయాణిస్తాయి. గేటు వేస్తే కిలో మీటర్ల మేర గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలని పాతికేళ్లుగా స్థానికులు కోరుతున్నారు. టీడీపీ హయాంలో ఆర్వోబీ నిర్మాణానికి చేసిన ప్రయత్నాలు కాగితాలకే పరిమితమయ్యాయి. సుమారు 50 గ్రామాలకు ప్రధానమైన ఈ మార్గంలో ఆర్వోబీ నిర్మించాలని ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌కు ప్రజలు విన్నవించారు. కాకినాడ ఎంపీ వంగా గీత కూడా సీఎం జగన్ ద్వారా అనేక సందర్భాల్లో కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. మొత్తం మీద రూ.150 కోట్లతో నిర్మాణానికి అనుమతి తీసుకు వచ్చారు. ఇందులో భూ నిర్వాసితులకు పరిహారం రూ.50 కోట్లకు గాను ఇప్పటికే రూ.45 కోట్లు విడుదల చేశారు. సీఎం చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్పందన ఫలితంగా నిడదవోలు, పిఠాపురం ఆర్వోబీల నిర్మాణ పనులు ఇక వేగం పుంజుకోనున్నాయి.

సీఎం చొరవతో ఆర్వోబీకి మోక్షం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆర్వోబీకి నిధు లు విడుదలయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్నికల ముందు హడావిడిగా చంద్రబాబు శంకుస్థాపనతో చేసి ఆనక వదిలేశారు. ఆర్వోబీ సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాను. ఈ సమస్య తీవ్రతను సీఎం గుర్తించారు. నిడదవోలు ఆర్వోబీకి నిధులు కేటాయించారు. చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభిస్తోంది.

– జీ శ్రీనివాసనాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పదిమందికి జైలు

కాకినాడ లీగల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తొమ్మిది మందికి వారం రోజుల జైలు, రూ.10 వేలు చొప్పున జరిమానా, మరో వ్యక్తికి వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఉషాలక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ ప్రాంతంలో మద్యం సేవించి వాహనంపై వెళుతున్నారు. వారిని సర్పవరం సీఐ మురళీకృష్ణ పర్యవేక్షణలో పోలీసులు 10మందిని పట్టుకున్నారు. గురువారం కోర్టులో 10మందిని హాజరుపరచగా నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆత్రేయపురం మురిసింది



- పూతరేకుల తయారీలో భౌగోళిక గుర్తింపు
- నెరవేరిన ఈ ప్రాంతవాసుల కోరిక
- వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు

ఆత్రేయపురం: ఆత్రేయపురం అంటే గుర్తుకు వచ్చేది పూతరేకు. పూతరేకు అంటే గుర్తుకువచ్చేది ఆత్రేయపురం. ఈ రెండింటి మధ్య అంత బంధం ఉంది. తాజాగా ఆ బంధం మరింత బలపడింది. భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. తరతరాలుగా వారసత్వ సంపదగా వస్తున్న పూతరేకుల తయారీపై ఈ ఊరికే పూర్తి స్థాయి గుర్తింపు, హక్కులు ఉన్నాయని తేలింది.

జీఐ గుర్తింపు

బందరు లడ్డు, తిరుమల లడ్డు, ఉప్పాడ జాంధానీ, ఏటికొప్పాక కొయ్య బొమ్మలు, బొబ్బిలి వీణ, బంగినపల్లి మామిడి, అరకు కాఫీ, ధర్మవరం చీర ..ఇలా ఓ ఊరికో లేదా ప్రదేశానికో ప్రత్యేకతను ఆపాదించే ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఐడెంటిటీ (జీఐ) లభిస్తుంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ పరిధిలో జీఐ ఉంటుంది. ఎంతో విశిష్టత, స్థానికతతో కూడిన చరిత్ర, గ్రామ భాగస్వామ్యం ఉంటే తప్ప జీఐ సాధ్యం కాదు. అలాంటి జాబితాలో ఇప్పుడు ఆత్రేయపురం పూతరేకు కూడా స్థానం సంపాదించింది. సగర్వంగా జాతీయ స్థాయిలో తలెత్తుకుంది.

పేపరు స్వీటుకు చరిత్ర

పూతరేకులకు పుట్టిల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం. వందేళ్లకు పైబడి ఈ పేపరు స్వీటుకు చరిత్ర ఉంది. పూర్వం మైసూరుకు చెందిన ఒక మహిళ ఆత్రేయపురం కోడలిగా వచ్చింది. అప్పట్లో అన్నం వారుస్తుంటే గంజికుండపై రేకులాంటి పదార్థం ఏర్పడటం ఆమె గమనించింది. రుచి చూసి ముచ్చటపడింది. ఇలా ఆవిర్భవించిందే పూతరేకు. తొలిరోజుల్లో ఇక్కడ ఒక సామాజిక వర్గం మహిళలే రేకులు తయారు చేసి పంచదార అద్దేవారు. కాలక్రమంలో దీనిని అన్ని వర్గాలూ అనుసరించాయి. తమ ఉపాధిగా మలుచుకున్నాయి. ముఖ్యంగా ఈ ఊరి మహిళలది రేకులు తయారుచేయడంలో అందెవేసిన చేయి. 400 కుటుంబాలకు పైగా రేకుల తయారీలో నిత్యం బిజీగా ఉంటాయి. క్రమేపీ అభిరుచికి అనుగుణంగా పూతరేకు కొత్త రుచిని, రూపాన్ని సంతరించుకుంది.

లా విద్యార్థుల సహకారం మరువలేం



మేం చాలాకాలంగా కోరుకుంటున్నది ఇన్నాళ్లకు సాకారమైనందుకు సంతోషంగా ఉంది. ముఖ్యంగా మాకు ఈ ప్రయత్నంలో అన్ని విధాలా సహకరించిన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల తోడ్పాటు మరువలేం. ముఖ్యంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ విభాగాధిపతి శ్రీసుధ సహకారం ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. పూతరేకులకు అన్ని రకాల వరి ఉత్పత్తులు పనికిరావు. మార్టేరు పరిశోధన కేంద్రం రూపొందించిన ఎంటీయూ 2636 రకం ధాన్యం మాత్రమే గట్టిగా ఉండి తర్వాత ఉత్పత్తికి అవసరమైన జిగురు వస్తుంది. పూతరేకుల తయారీపై మరింత మనసు పెట్టాలని ఈ ప్రాంత వాసులను కోరుతున్నాను.

– గాదిరాజు ప్రసాదరాజు, కాటన్ ఆత్రేయపురం పూతరేకుల వెల్ఫేర్ అసోసియేషన్ ట్రెజరర్

జీఐ కోసం ఎంతో కృషి

తమ ఊరితో ఇంతగా అనుబంధాన్ని పెనవేసుకున్న పూతరేకుకు భౌగోళిక గుర్తింపు రావాలని ఆత్రేయపురం వాసులు చాన్నాళ్లుగా కోరుకుంటున్నారు. మూడేళ్లుగా ఇందుకోసం గట్టిగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్థర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు ఈ ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలోని ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ విభాగం ఆధ్వర్యంలో లా స్టూడెంట్స్ వీరి కృషికి తోడయ్యారు. ఆత్రేయపురం వచ్చి పూతరేకుకూ ఈ గ్రామానికి ఏర్పడిన విడదీయరాని బంధానికి సంబంధించి వివిధ ఆధారాలను సేకరించారు. ఉపాధిగా మారి ఎగుమతుల స్థాయికి చేరిన ఈ ఆహార ఉత్పత్తిపై డాక్యుమెంట్లను తయారు చేశారు. 2021 డిసెంబరు 13న చెన్నైలోని జియో ఐడెంటిటీ కార్యాలయానికి దరఖాస్తును సమర్పించారు.

నిశిత పరిశీలన తర్వాత

కొద్ది నెలల అనంతరం చెన్నై కార్యాలయంలో దరఖాస్తు ప్రాసెస్ మొదలైంది. ఆధారాలతో సహా హాజరుకావాలని ఇక్కడివారికి ఆహ్వానం అందింది. ఆత్రేయపురం నుంచి ఏడుగురు జీఐ కార్యాలయానికి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది నిపుణులు వీరిని లోతుగా ప్రశ్నించారు. ఈ ప్రక్రియకు ఆన్‌లైన్ ద్వారా హాజరైన ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి గోనెల రాజేంద్రప్రసాద్ జీఐ అధికారుల ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వగలిగారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న జీఐ జర్నల్‌లో ఆత్రేయపురం పూతరేకుల గురించి ప్రచురించింది. అభ్యంతరాలుంటే 120 రోజుల్లో తెలియజేయాలని సూచించింది. ఈ గడువు ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. దీంతో ఆత్రేయపురం వాసుల కల నెరవేరింది. భౌగోళిక గుర్తింపు(జీఐ) లభించింది.



చాలా ఆనందంగా ఉంది



ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. పూతరేకుల తయారీతో ఇప్పటికే మంచి గుర్తింపు వచ్చింది. ఇక మా ఆత్రేయపురానికి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి లభిస్తుంది.

–జి.నాగమణి, ఆత్రేయపురం

ప్రోత్సాహం అందించాలి



చాలాకాలం నుంచి పూతరేకులు తయారు చేస్తున్నాం. పేద మహిళలు చాలామంది ఇదే అధారంగా బతుకుతున్నారు. ప్రోత్సాహం అందిస్తే పూతరేకుల వ్యాపారం మరింత పెరుగుతుంది. భౌగోళిక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది.

–వేగిరాజు రాజేశ్వరీ, ఆత్రేయపురం

ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలి

సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



గుర్తింపుకార్డు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞానసదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల గౌరవానికి ఎవరూ భంగం కలిగించకూడదని, అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాన్స్‌జెండర్లు వారి హక్కుల గురించి తెలుసుకోవడం చాలా అవసరమన్నారు. వారి సంక్షేమం కోసం అందుబాటులో ఉన్న పథకాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వారు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లకు పోలీస్ డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందని రాజమహేంద్రవరం ఏఎస్పీ జి. వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న డిసేబుల్ వెల్ఫేర్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ పథకాలను వివరించారు. డీపీసీయూ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం వారికున్న వైద్య సదుపాయాలను వివరించారు. ఆర్థికంగా బలపడేందుకు వారికి రుణాలు అందిస్తారని మెప్మా ప్రాజెక్టు మేనేజర్ కె.మోహన్ కుమార్ తెలిపారు. అనంతరం ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు న్యాయమూర్తి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జె.మహేష్, దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.తిరుమలరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ మాలతి, రెవెన్యూ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, డీఎంహెచ్‌వో పౌర సరఫరాల శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, ఎన్జీవో సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని నమూనా ఆలయ నిర్మాణానికి ఆమోదం

స్థానిక జాతీయ రహదారిపై రత్నగిరివాసుడు సత్యదేవుని నమూనా ఆలయం నిర్మాణానికి మరో ముందడుగు పడింది. స్వామివారి నమూనా ఆలయంతో పాటు ప్రసాద విక్రయ కౌంటర్, ఫుడ్ ప్లాజా, వెహికల్ పార్కింగ్, టాయిలెట్స్ బ్లాక్‌ల నిర్మాణానికి సంబంధించి రూ.3.57 కోట్ల టెండర్‌కు దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు ఒకటి రెండ్రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ గురువారం విలేకరులకు తెలిపారు.

రూ.3.57 కోట్ల నిర్మాణ టెండర్‌కు కమిషనర్ గ్రీన్‌సిగ్నల్



సత్యదేవుని ఆలయం, ఇతర నిర్మాణాల నమూనా చిత్రం

లాంఛనంగా పనులు ప్రారంభం

దేవదాయశాఖ కమిషనర్ నమూనా ఆలయ నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుధవారం లాంఛనంగా పనులు ప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. గురువారం ఆయన నిర్మాణ స్థలంలో పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. డిగ్రీ కళాశాల సమీపంలో దేవస్థానానికి గల 70 సెంట్ల స్థలాన్ని జాతీయ రహదారికి సమాంతరంగా ఎత్తు చేసి రిటైనింగ్ వాల్ నిర్మించి ఆ స్థలంలో స్వామివారి నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ ప్లాజా, టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు గత నెలలో రూ.3.44 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచిన విషయం తెలిసిందే. ఆ టెండర్లను తొమ్మిదో తేదీన తెరవగా అంచనా వ్యయం కన్నా 4.95 శాతం అధికంగా పడిన టెండర్ లోయెస్ట్‌గా నిలిచింది.

అయితే రివర్స్ టెండర్, చర్చల ద్వారా కోట్ చేసిన టెండర్ కన్నా ఒక శాతం తక్కువగా అంటే 3.95 శాతం ఎక్కువకు టెండర్‌ను ఖరారు చేశారు. దీంతో రూ.3.57 కోట్లకు టెండర్ ఖరారైందని ఈఓ వివరించారు.

కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని సచివాలయాల్లో కార్యదర్శులకు గురువారం బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సమక్షంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 52 మందికి ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, కాకినాడ నగరపాలక సంస్థతోపాటు ఏడు మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల కార్యదర్శులకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జీవీఎస్ఎస్ మూర్తి, వివిధ పురపాలక సంఘ కమిషనర్లు జె.సురేంద్ర, టి.కృష్ణవేణి, టి.రామ్‌కుమార్, కె.శ్రీకాంత్‌రెడ్డి, డిజెఎస్ రాజు, వీఎల్ నాయుడు, జి.లోవరాజు హాజరయ్యారు.

వన్ వే సమ్మర్ స్పెషల్ రైలు రేపు

రాజమహేంద్రవరం సిటీ: వేసవి ప్రయాణికుల రద్దీని అనుసరించి జిల్లా మీదుగా శనివారం హుబ్లీ– విశాఖపట్నం (07305) వన్ వే సమ్మర్ స్పెషల్ రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు (18వ తేదీ) హుబ్లీ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

పెదపూడి: లారీతో మోపెడ్ వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ పి.సుబ్బారావుకు కాకినాడ పీజేసీఎం కోర్టు జడ్జి సుందరి గురువారం ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు పెదపూడి ఎస్సై వి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019 ఆగస్టు ఒకటో తేదీన రామేశ్వరం గ్రామానికి చెందిన వి.వరలక్ష్మి, కొండలరావు దంపతులు మోపెడ్ వాహనంపై కాకినాడ వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ రామేశ్వరంలో వారిని ఢీకొట్టింది. గాయాలపాలైన వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అందించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ రాత్రి 10 గంటల వరకు ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనాలకు సంబంధించి ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. నామవరం నుంచి మోరంపూడి సెంటర్ మీదుగా రాజమహేంద్రవరం నగరంలోకి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు సాయినగర్ దుర్గమ్మ టెంపుల్ వద్ద కుడి పక్కకు తిరిగి గాదాలమ్మ రోడ్డు మీదుగా అప్సర లాడ్జి వద్ద నుంచి నేషనల్ హైవేకి వెళ్లాలన్నారు.సాయినగర్ దుర్గమ్మ టెంపుల్‌కి ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా, గంగిరెడ్ల కాలనీ మీదుగా హుకుంపేట సెంటరుకు వెళ్లాలి. నామవరం నుంచి వచ్చే భారీ వాహనాలు సాయినగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా వున్న రోడ్డులో గాదాలమ్మ రోడ్డు మీదుగా నేషనల్ హైవేకి వెళ్లాలి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి నామవరం వెళ్లే వాహనాలు మార్గాని ఎస్టేట్ ఎదురుగా వున్న పెద్ద రోడ్డు మీదుగా రైతుబజార్ సెంటర్, కవలగొయ్యి సెంటర్, నేషనల్ హైవే మీదుగా నిమ్మకాయల మార్కెట్ రోడ్డు (గాదాలమ్మ గుడి రోడ్డు) మీదుగా నామవరం వెళ్లాలి. పై ట్రాఫిక్ మళ్లింపు అంశాలను రాజమహేంద్రవరం పట్టణ, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు గమనించాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో వీకే రాయపురం–మాధవపట్నం మధ్యలో గోదావరి కాలువలో ఉన్న మహిళ మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై గోపాలకృష్ణ, ఏఎస్సై మూర్తి ఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. వారి కథనం ప్రకారం సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళ మృతదేహాన్ని గోదావరి కాలువలో గమనించారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతదేహం పై బ్లూ కలర్ జాకెట్టు, ఆకుపచ్చ చీరపై నలుపు, పింక్ రంగుల డిజైన్ కలిగిన చీర ఉంది. వివరాల కోసం సీఐ కె.దుర్గాప్రసాద్ 9440796568, ఎస్సై గోపాలకృష్ణ 7013004400 నంబర్లలో సంప్రదించాలన్నారు. కేసు ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

వంటనూనెల రంగంలో స్వయం సమృద్ధి

ప్రముఖ యోగా గురువు, పతంజలి ఆయుర్వేద బ్రాండ్ అంబాసిడర్ రామ్‌దేవ్‌బాబా



జి.దొంతమూరు ఆయిల్‌పామ్ తోటలో రైతులతో మాట్లాడుతున్న రామ్‌దేవ్‌బాబా

రంగంపేట: ఆయిల్‌పామ్ తోటల సాగుతో దేశం వంటనూనెల రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తుందని ప్రముఖ యోగా గురువు, పతంజలి ఆయుర్వేద బ్రాండ్ అంబాసిడర్ రామ్‌దేవ్‌బాబా అన్నారు. రంగంపేట మండలంలోని జి.దొంతమూరులోని ఆయిల్‌పామ్ తోటను ఆయన గురువారం పరిశీలించారు. రైతులనుద్దేశించి మాట్లాడారు. ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగినా, ఏటా వేలాది కోట్ల రూపాయల విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకోవడం శోచనీయమన్నారు. పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ తోటలు పెంచాలన్నారు. ఈ విషయంలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల తెలుగు రైతులను అభినందించాలన్నారు. దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ తోటల సాగులో తెలుగు రైతుల వాటా 65 శాతం పైగా ఉండటం అభినందనీయమన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఆయిల్‌పామ్ తోటల ప్రోత్సాహక పథకం కింద అస్సాం, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఈ పంట సాగుకు ముందుకు వస్తున్నాయన్నారు. పతంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈఓ సంజీవ్ ఆస్తానా మాట్లాడుతూ పతంజలి ఉత్పత్తులు నాణ్యతకు పెట్టింది పేరన్నారు. రైతుల తరఫున ఉమ్మడి రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు కనీస మద్దతు ధర ఉండేలా రామ్‌దేవ్‌బాబా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు, రుచిసోయా కంపెనీ ఉన్నతాధికారులు పట్టాభిరామిరెడ్డి, రవీంద్ర, రైతు నాయకులు ఉప్పలపాడు అమ్మిరాజు, పుట్టా సోమన్న చౌదరి పాల్గొన్నారు.

బాలింత మృతిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: బాలింత మృతిపై కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. కాకినాడ స్వామినగర్‌లో బాలింత పిల్లి గంగాభవాని(26) గురువారం ఉదయం మృతి చెందింది. ఆమెకు రమణయ్యపేట కొత్తూరు బర్మాకాలనీకి చెందిన పిల్లి నాగేశ్వరరావుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 2017లో బాబు పుట్టాడు. మరోసారి గర్భిణి కావడంతో పుట్టింటికి కాన్పు కోసం వచ్చింది. నెల రోజులు క్రితం పాపకు జీజీహెచ్‌లో జన్మనిచ్చింది.

ఇద్దరు పిల్లలు చాలు అనుకొని ఏడు రోజుల క్రితం జీజీహెచ్‌లో సిజేరియన్ చేయించుకుంది. ఇంటి వద్ద గురువారం ఉదయం ఆమె కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. బాలింతది సాధారణ మరణమని, తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రేపటి నుంచి వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురియాలని కోరుకుంటూ శనివారం నుంచి 21వ తేదీ వరకు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వరుణ జపాలు నిర్వహించాలని దేవస్థానం ఆగమ కమిటీ సూచించినందున ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. శనివారం ఉదయం 7–30 గంటలకు స్వామివారి ఆలయం వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేసి ఆవాహన చేస్తారు. అనంతరం సుబ్రహ్మణ్య ఆవాహన, వారుణాక వాక మంత్ర పఠనం, వరుణ జపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 నుంచి 21 వరకు ఉదయం 7–30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.